క్లుప్తంగా

ఎన్నికల కోడ్ అమలు తప్పనిసరి


మాట్లాడుతున్న ఎస్ఐ కృష్ణారావు

గొలుగొండ: ప్రతి ఒక్కరూ ఎన్నికల కోడ్ అనుసరించే ఉండాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ బి. కృష్ణారావు గురువారం తెలిపారు. వచ్చే నెల 4న ఏపీ ఫలితాలు నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడా బాణసంచా, సంబరాలు, ఊరేగింపులు చేయొద్దని హెచ్చరించారు. శాంతియుత వాతావరణంలో ఫలితాలు వెలువడుతాయని, ప్రజలు పూర్తిగా పోలీసులకు సహకరించాలన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో అవగాహన కల్పించామన్నారు. ప్రజలు వీటిని దృష్టిలో పెట్టుకొని సహకరించాలని తెలిపారు.

1న మండల సర్వసభ్య సమావేశం

మాడుగుల రూరల్: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వచ్చే నెల ఒకటో తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఆర్. కాశీ ప్రసాదరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో ఈ సమావేశంలో ఎటువంటి తీర్మానాలు ఉండవన్నారు. ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ అధ్యక్షతన జరిగే సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

మాకవరపాలెం: వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. స్థానిక బస్టాండు పక్కన వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం నిర్మించి ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయంలో స్వామివారి కల్యాణం వేదమంత్రోచ్చరణ నడుమ జరిపారు. ఈ కల్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానికులు, ఇతర ప్రాంతాల వారు హాజరై ప్రసాదం స్వీకరించారు. విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పంతం ఆదినారాయణ, ఆరిపాక శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం


ప్రయాణికులకు మజ్జిగ అందిస్తున్న యువకులు

కె.కోటపాడు: సూర్రెడ్డిపాలెం కూడలి వద్ద బాల గణేష్ యూత్ సభ్యులు మజ్జిగ చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఉపాధి వేతనదారులతోపాటు ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులకు మజ్జిగ పంచిపెట్టారు. తీవ్ర ఎండల దృష్ట్యా సామాజిక బాధ్యతతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన యువకులను పలువురు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో బుద్ధ పౌర్ణమి వేడుకలు


వడ్డాది ఐటీఐలో బుద్ధుని బోధన పుస్తకాలతో విద్యార్థులు

బుచ్చెయ్యపేట: మండలంలో బుద్ధ పౌర్ణమి వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దిబ్బిడి, సీతయ్యపేట, వడ్డాది తదితర గ్రామాల్లో బుద్ధుని విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. వడ్డాది ఐటీఐలో అతిథి దేవోభవ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు కామేశ్వరరావు, ప్రిన్సిపాల్ సత్యనారాయణ బుద్ధుని చరిత్ర గురించి విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ బుద్ధుని అడుగుజాడల్లో నడుచుకోవాలని ఆయన సూక్తులతోపాటు బుద్ధం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి అను సిద్ధాంతాల్లో నడుచుకోవాలన్నారు. బౌద్ధ ధర్మ ఆర్య సూత్రాలు, బుద్ధుడు అష్టాంగ ఉపదేశాలు, శత రచనావళి, పంచసూత్రాలు అను రచనా పుస్తకాలను అతిథి దేవోభవ సంస్థ ఉచితంగా పంపిణీ చేసింది.

చెత్త సమస్యకు చెక్

- రావికమతం డంపింగ్ యార్డుకు స్థలం కేటాయింపు
- రీ సర్వేతో తీరిన 20 ఏళ్ల నాటి సమస్య


తహసీల్దార్ కార్యాలయం వద్ద నుంచి తరలిస్తున్న చెత్త


రావికమతం గుర్రయ్యకట్ట వద్ద కేటాయించిన 20 సెంట్ల స్థలం

రావికమతం: రెండు దశాబ్దాలుగా పట్టి పీడిస్తున్న పారిశుధ్య సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. సమగ్ర భూ రీసర్వే కారణంగా స్థానిక గుర్రయ్య కట్ట వద్ద సర్వే నంబరు 65/1లో 0.52 సెంట్ల ఆక్రమణ స్థలాన్ని అధికారులు గుర్తించి డంపింగ్ యార్డుకు కేటాయించారు. దాంతో తహసీల్దార్ కార్యాలయం, మీసేవ, హైస్కూల్ వద్ద కుప్పలుతెప్పలుగా పేరుకు పోయిన చెత్తను గురువారం నుంచి తరలిస్తున్నారు. రావికమతంలో ఆరు వేల కుపైగా జనాభా ఉంది. వీరంతా చెత్తా చెదారాలు రోడ్డుకు ఇరువైపులా ఖాళీ స్థలాల్లో పారబోస్తున్నారు. పైగా చెత్త డంపింగ్ చేయడానికి ఎక్కడా ప్రభుత్వ స్థలం లేకపోవడంతో నిత్యం పంచాయతీ పారిశుధ్య సిబ్బంది స్థానిక తహసీల్దార్ కార్యాలయం, హైస్కూల్ సమీపంలో చెత్త వేస్తున్నారు. దీంతో అధికారులు, కార్యాలయానికి వచ్చే ప్రజలు, ఇటు విద్యార్థులు దుర్వాసన భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు స్పందనలో ఫిర్యాదులు చేయగా జిల్లా అధికారులు రావడం సమస్య పరిష్కారానికి గానూ గుడివాడ, పిల్లవానిపాలెం, గొంప ప్రాంతాల్లో తాత్కాలికంగా చెత్త వేయించే వారు. దీనిపై ఆయా గ్రామాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో సమస్య మళ్లీ మొదటికే వచ్చేది. ఈ సమస్య పరిష్కరించడానికి మండల అధికారులకు తలకు మించిన భారమయ్యేది.

ఈ నేపథ్యంలో భూ రీసర్వేలో భాగంగా స్థానిక గుర్రయ్యకట్ట వద్ద రోడ్డు పోరంబోకు ఆక్రమణను గుర్తించారు. ఈ భూమిని తహసీల్దార్ రమణారావు గురువారం పరిశీలించారు. ఆక్రమణదారుడి సరైన పత్రాలు చూపక పోవడంతో ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుని 0.20 సెంట్లు స్థలాన్ని డంపింగ్ యార్డుకు కేటాయించారు. దాంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సంపద తయారీ కేంద్రాలతో ఆదాయం

ఎంపీడీవో జాగరపు రాంబాబు


సంపద తయారీ కేంద్రంలో పంచాయతీ కార్యదర్శికి సూచనలు చేస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రాల నిర్వహణ ద్వారా పంచాయతీలకు ఆదాయం వస్తుందని ఎంపీడీవో జాగరపు రాంబాబు అన్నారు. నాతవరంలో చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఇక్కడ కేంద్రం నిర్వహణ ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇంటింటా సేకరించిన తడి, పొడి చెత్త ద్వారా ఆయా కేంద్రాల్లో సేంద్రియ ఎరువులు తయారీ చేసే విక్రయాలు చేసేవారన్నారు. తద్వారా పంచాయతీలకు అదనంగా ఆదాయం వచ్చేదన్నారు. గ్రామ వీధుల్లో పారిశుధ్య సమస్య ఉండేది కాదన్నారు. ఈ విధంగా చేయడం వల్ల గ్రామాల్లో రోగాలు నివారించేందుకు చక్కటి అవకాశం ఉంటుందన్నారు. నాతవరంలో చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రానికి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. గ్రామాల్లో దండోరా వేయించి ఇళ్ల నుంచి తడి పొడి చెత్త సేకరించి దానిని కేంద్రానికి తరలించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రాల్లో సేంద్రియ ఎరువులు తయారీ చేసేందుకు దృష్టి సారించాలన్నారు. వచ్చేది వర్షాకాల సీజన్ కావడంతో గ్రామాలు శుభ్రంగా ఉండాలంటే కేంద్రాల నిర్వహణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. పంచాయతీ విస్తరణాధికారి ఎస్.ఎస్.వి.మూర్తి, పంచాయతీ కార్యదర్శి శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

పది సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

మాడుగుల రూరల్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు స్థానిక ఆర్సీఎం గర్ల్స్ హైస్కూలులో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ సిస్టర్ సుజాత డోమినిస్, డిపార్టుమెంట్ అధికారి రమణమూర్తి గురువారం తెలిపారు. ఈ పరీక్షలకు 240 మంది విద్యార్థులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. తొలి రోజు తెలుగు, ఈ నెల 25న హిందీ, 27న ఇంగ్లిషు, 28న గణితం, 29న ఫిజికల్ సైన్సు, 30న సైన్సు, 31 సోషల్ పరీక్ష ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఈ మేరకు తహసీల్దారు, ఎస్ఐలకు సమాచారం అందించామన్నారు. ప్రాథమిక వైద్య సేవలు అందించడానికిగాను ఏఎన్ఎం, ఆశ, కార్యకర్తలతో ఉచిత వైద్య సేవలు అందిస్తారన్నారు.

సెల్‌ఫోన్ అతిగా వాడితే అనర్థమే..


అవగాహన కల్పిస్తున్న గ్రంథపాలకురాలు దమయంతి


శిబిరంలో ఆసక్తిగా పాల్గొన్న విద్యార్థులు


గొలుగొండ గ్రంథాలయంలో బుక్ రీడింగ్ చేస్తున్న విద్యార్థులు

నర్సీపట్నం: స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం సెల్‌ఫోన్ వల్ల కలిగే లాభాలు, నష్టాలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. బలిఘట్టం జెడ్పీ హైస్కూల్ సోషల్ టీచర్ సిహెచ్.రాంకుమార్ మాట్లాడుతూ అవసరం మేరకు సెల్‌ఫోన్ వినియోగించుకోవాలన్నారు. అంతకు మించి వాడితే భవిష్యత్ దెబ్బతింటుందన్నారు. రిసోర్స్ పర్సన్ పద్మ మాట్లాడుతూ దురాశ దుఃఖానికి చేటు ఏవిధంగా కలుగుతుందో కథ రూపంలో విద్యార్థులకు వివరించారు. క్రాఫ్ట్ ఉపాధ్యాయిని మాధవి పేపర్‌తో గులాబీ పూలు ఎలా చేయాలో విద్యార్థులకు నేర్పించారు. ఉపాధ్యాయులు చెప్పిన అంశాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని గ్రంథాలయ అధికారి పి.దమయంతి సూచించారు.

రోలుగుంట: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 15న ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరాలు గురువారం కొనసాగాయి. దీనిలో భాగంగా గ్రంథాలయాధికారి ఎస్.వరలక్ష్మి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని వారి ప్రతిభ చూపించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

బుక్ రీడింగ్‌పై అవగాహన

గొలుగొండ: విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకొని మంచి విజ్ఞానాన్ని సంపాదించుకోవాలని గ్రంథాలయ అధికారి రాజుబాబు తెలిపారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుక్ రీడింగ్ కార్యక్రమం నిర్వహించారు. విశ్రాంత గ్రంథాలయ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి బుక్ రీడింగ్ అలవర్చుకోవాలన్నారు.

ప్రజల చెంతకే మెరుగైన వైద్యం


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సుబ్రహ్మణ్యం

కె.కోటపాడు: ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంతో ప్రజల చెంతకే వచ్చి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి బి.సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం సూర్రెడ్డిపాలెంలో 167 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ప్రసవాలను ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చేసుకోవాలన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యం క్షేమదాయకమన్నారు. హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, ఏఎన్ఎం దేవి, ఎం.ఎల్.హెచ్.పి. హేమ పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో వైద్య సేవలు

మాడుగుల రూరల్: మండలంలో రెండు గ్రామాల్లో గురువారం ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం నిర్వహించారు. మాడుగుల -1 ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలో 70 మందికి కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.వి.ఎస్.ఎస్. ప్రసాదుపాత్రుడు వైద్య సేవలందించారు. స్థానిక పంచాయతీ కమ్యూనిటీ హాలులో బీపీ, సుగర్, వ్యాధిగ్రస్తులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కింతలి పీహెచ్‌సీ పరిధిలోవ కృష్ణాపురంలో 60 మందికి వైద్యాధికారి కె.ఎం.నాయుడు వైద్య సేవలందించారు. ఎ.ఎన్.ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సలకు 35 మంది ఎంపిక


వృద్ధులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కె.కోటపాడు: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం కె.కోటపాడులో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 122 మంది వృద్ధులకు ఆప్తాలమిస్టులు మధులిక, హరిచందన కంటి పరీక్షలు చేశారు. వీరిలో 35 మందికి నేత్ర శస్త్ర చికిత్సలను అవసరంగా గుర్తించారు. ఉచితంగా నిర్వహించేందుకు విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి ప్రత్యేక బస్సులో తరలించారు. వాసవీ క్లబ్ ద్వారా పలు సేవా కార్యక్రమాలను సామాజిక బాధ్యతతో చేస్తున్నామని క్లబ్ అధ్యక్షుడు విన్నకోట ఆనందరావు తెలిపారు. కార్యదర్శి కోట్ల రాంబాబు, శ్రీకాంత్ శ్రీను, మామిడి రమణాజీ తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణంతో తొలగిన ఇబ్బందులు


ముకుందపురం - వంటర్లపాలెం బీటీరోడ్డు

మాడుగుల రూరల్: మండలంలో వంటర్లపాలెం నుంచి ముకుందపురం పోవు రహదారి నిర్మాణంతో రెండు గ్రామాల ప్రజల రవాణా కష్టాలు తొలగిపోయాయి. సుమారు రెండు కిలోమీటర్ల మేర రహదారి పూర్తిగా గోతులమయంగా ఉండేది. ఏ మాత్రం వర్షం కురిసినా గోతుల్లో నీరు చేరి రాకపోకలు సాగించడం కష్టతరంగా ఉండేది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో పి.ఎం.జి.ఎస్.వై. నిధులు రూ.80 లక్షలతో బీటీరోడ్డు నిర్మించారు. ముకుందపురం సచివాలయానికి వెళ్లడానికి వంటర్లపాలెం గ్రామస్తులకు ఇబ్బందులు తొలగాయి. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అప్పలరాజుపురం, చీడికాడ వెళ్లడానికి అనుకూలమైంది.

కొలువుదీరిన మోదకొండమ్మ ప్రతిరూపం


సతకంపట్టు వద్ద మోదకొండమ్మ ప్రతిరూపం

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ప్రతి రూపమైన ఘటాలు, పాదాలు సతకంపట్టు వద్ద కొలువు దీరాయి. ఈ సందర్భంగా ఇక్కడ అమ్మవారిని గురువారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ విధంగా దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని ప్రతీతి. మహరాజుల కాలం నుంచి నెల రోజుల పాటు సతకంపట్టు వద్ద కొలువై భక్తులకు దర్శనమిస్తుంటారు.

ఘనంగా మరిడిమాంబ పండగ


దర్శనానికి వెళ్తున్న భక్తులు


కాగడాలతో అమ్మవారి ఊరేగింపు

బుచ్చెయ్యపేట: ఐతంపూడి గ్రామదేవత మరిడిమాంబ పండగను గ్రామస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీలకు అతీతంగా గ్రామ శివారులో అమ్మవారి ఆలయం వద్దకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అమ్మవారిని ఊయలలో ఆడించారు. ఈ ఏడాదిలో నమ్ముగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండి, సిరి సంపదలతో, ఆయురారోగ్యాలతో తులతూగాలని అమ్మవారిని ప్రార్థించి మొక్కులు చెల్లించుకున్నారు. బుచ్చెయ్యపేట, కేపీ అగ్రహారం, పైడంపేట, కొండపాలెం తదితర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో ఎటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించకుండా పోలీసులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

వ్యాధినిరోధక టీకాలు తప్పనిసరి


యరకన్నపాలెంలో టీకాలు వేస్తున్న డీడీ నర్సింహులు

మాకవరపాలెం: గొర్రెలు, మేకలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరని పశుసంవర్ధకశాఖ డీడీ నర్సింహులు సూచించారు. మండలంలోని తామరం, యరకన్నపాలెంలో నిర్వహించిన టీకాల కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి ప్రారంభమైన ఈ టీకాల కార్యక్రమం వచ్చే నెల 15వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. రాచపల్లి, బూరుగుపాలెం, మాకవరపాలెం పశువైద్య కేంద్రాల పరిధిలో పది వేల డోసులు గొర్రెలు, మేకలకు వేస్తున్నట్టు చెప్పారు. అన్ని గ్రామాల్లోనూ ధనుర్వాతం నివారణకు ఈ టీకాలు వేస్తున్నారని, పెంపకం దారులు తప్పనిసరిగా జీవాలకు వేయించుకోవాలని సూచించారు. రాచపల్లి డాక్టర్ అనిల్‌కుమార్, సిబ్బంది రామ్‌మోహన్, అప్పలనాయుడు, నారాయణమూర్తి పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్..!

నాతవరం మండలానికి చేరిన 24,435 పుస్తకాలు


సబ్జెక్టుల వారీగా పాఠ్యపుస్తకాలు సిద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు

నాతవరం: పాఠశాలలు పునః ప్రారంభానికి ముందే విద్యార్థులకు కావలసిన పాఠ్య పుస్తకాలు సిద్ధం చేస్తున్నామని ఎంఈవో- 2 కామిరెడ్డి వరహాలబాబు తెలిపారు. ప్రభుత్వం నుంచి మండలానికి వచ్చిన పాఠ్య పుస్తకాలను నాతవరం హైస్కూల్‌లో సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం సాయంత్రానికి ఒకటి నుంచి పదో తరగతి వరకు వివిధ సబ్జెక్టులకు సంబంధించి 24,435 పాఠ్య పుస్తకాలు వచ్చాయన్నారు. మిగిలిన పాఠ్య పుస్తకాలు విడతల వారీగా వస్తున్నాయన్నారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 4,896 మంది విద్యార్థులు చదువుతున్నారని పేర్కొన్నారు. మండలానికి పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు వచ్చాక పాఠశాలలకు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. అదేవిధంగా నాడు- నేడు పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేలా దృష్టి సారించామన్నారు ఉపాధ్యాయులు ఎల్.వి.పాత్రుడు, జగన్నాథరావు, సీఆర్పీలు పోలుపర్తి నాగేశ్వరరావు, గోవిందు, వెంకటలక్ష్మి, ఎమ్మార్సీ సిబ్బంది అంకంరెడ్డి శ్రీను, నాయుడు, సాంబ పాల్గొన్నారు.

యూకలిప్టస్ తోటపై స్మగ్లర్ల కన్ను

- గుట్టుచప్పుడు కాకుండా తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి గండి!


గాంధీనగరం సమీపంలో యూకలిప్టస్ తోట

నాతవరం: అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వానికి ఆదాయానిచ్చే యూకలిప్టస్ తోటపై స్మగ్లర్ల కన్ను పడింది. రాత్రిళ్లు నరికివేసి అక్రమంగా తరలించుకుపోతున్నారు. మండలంలో గాంధీనగరం వద్ద నర్సీపట్నం - తుని మధ్య ఆర్అండ్‌బీ రోడ్డును ఆనుకుని పెదిమికొండ అటవీ ప్రాంతంలో నర్సరీ ఉంది. ఈ నర్సరీలో ఆరెకరాల విస్తీర్ణంలో గాంధీనగరం గ్రామానికి చెందిన వన సంరక్షణ సమితి సభ్యులు 1997లో యూకలిప్టస్ మొక్కలు వేసి తోట పెంచారు. ఈ తోటలో ప్రస్తుతం ఏపుగా పెరిగిన భారీ వృక్షాలు ఈదురు గాలులకు నేలకొరిగిపోతున్నాయి. దీనిపై అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణ నామమాత్రంగా ఉండటంతో అక్రమార్కులకు వరంగా మారింది. యూకలిప్టస్ చెట్లను నరికి అక్రమంగా తరలించుకుపోతున్నారు.

కేసుల నమోదుతోనే సరి...

రెండేళ్ల క్రితం గాంధీనగరం గ్రామానికి చెందిన కొంతమంది రాత్రిళ్లు యూకలిప్టస్ చెట్లను నరికి గుట్టు చప్పుడు కాకుండా ట్రాక్టరుపై రవాణా చేస్తుండగా స్థానికులు పట్టుకుని అధికారులు అప్పగించారు. అప్పట్లో కేసులు నమోదు చేయడంతో కొంతకాలం పాటు స్మగ్లర్ల ఆగడాలు తగ్గాయి. ఇటీవల మరలా ఏపుగా పెరిగిన యూకలిప్టస్ చెట్లపై కన్నేశారు. పథకం ప్రకారం అక్రమంగా తరలించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకేసారి కాకుండా దఫా దఫాలుగా చెట్లను నరికి రవాణా చేస్తున్నారు. ఇక్కడ తోటకు ఇరువైపులా తారు రోడ్డు ఉండటంతో రాత్రిళ్లు ఏ సమయంలోనైనా తరలించేందుకు అనువుగా ఉంది. దాంతో అధికారులు కళ్లుకప్పి రెప్పపాటులో తరలిస్తున్నారు. యూకలిప్టస్ తోటను కటింగ్ చేయాలని కొంత కాలంగా గాంధీనగరం పెద్దలు ఫిర్యాదులు చేస్తున్నారు. తోట కటింగ్ చేయడం వల్ల ప్రభుతానికి ఆదాయం రావడంతోపాటు స్థానికులకు కొన్ని రోజులపాటు కూలీ పని దొరుకుతుందని ఆశిస్తున్నారు. గ్రామస్తులు విన్నపాలను అటవీశాఖ అధికారులు నేటికీ పట్టించుకున్న పాపానపోలేదు. ఇదే నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తే యూకలిప్టస్ తోట కనుమరుగయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

55 డ్వాక్రా సంఘాల రికార్డుల ఆడిట్


రికార్డులను పరిశీలిస్తున్న సతీష్

కె.కోటపాడు: డ్వాక్రా సంఘాల్లో ప్రతి మహిళా ఆర్థికాభివృద్ధికి రుణాలను అందించడంతోపాటు తిరిగి బ్యాంకులకు సకాలంలో చెల్లించడంలో వెలుగు సిబ్బంది పాత్ర కీలకమని వార్షిక ఆడిట్ పర్యవేక్షణాధికారి కె.సతీష్ అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో వార్షిక ఆడిట్ నిర్వహించారు. మండలంలో 55 గ్రామైక్య సంఘాలకు సంబంధించి స్త్రీనిధి, కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్(సీఐఎఫ్) నిధుల వివరాల రికార్డులను ఆయన పెందుర్తి ఏరియా కోఆర్డినేటర్ రాజేశ్వరితో కలిసి పరిశీలించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధి ద్వారా రూ.6.22 కోట్లు, సీఐఎఫ్ ద్వారా రూ.కోటి డ్వాక్రా సంఘాలకు అందించినట్లు ఏపీవో పి.వెంకటలక్ష్మి తెలిపారు. వీవోఏలు ప్రతి నెలా గ్రామ సంఘం సమావేశాన్ని విధిగా నిర్వహించాలని, రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఏరియా కోఆర్డినేటర్ తెలిపారు. కార్యక్రమంలో సీసీలు వెంకటరావు, సన్యాసిరావు, సూర్యనారాయణ, సీతంనాయుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు


దోమల నివారణకు మందు స్ప్రేయింగ్ చేస్తున్న దృశ్యం

గొలుగొండ: మలేరియా సోకకుండా ముందుగానే గ్రామాల్లో ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తున్నామని వైద్యాధికారి శ్యామ్ తెలిపారు. గురువారం లింగంపేటలో మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో దోమల నిర్మూలనకు స్ప్రేయింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్యామ్ మాట్లాడుతూ ఇంటి వద్ద నిల్వ నీరు లేకుండా చూసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది ఇచ్చే ప్రతీ సలహా పాటించినప్పుడే ఈ వ్యాధి బారిన పడకుండా ఉంటారన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న కల్యాణోత్సవాలు

మాడుగుల: స్థానిక వేంకటేశ్వర ఆలయంలో ఈ నెల 18న ప్రారంభమైన స్వామివారి కల్యాణోత్సవాలు శుక్రవారం పుష్పాంజలి సేవతో ముగియనున్నాయని అర్చకులు తెలిపారు. ఈ కల్యాణోత్సవాలు అలనాటి సంప్రదాయంతో మహరాజులు కాలం నుంచి జరుగుతున్నాయన్నారు.